క్లుప్తంగా

క్రీడా దుస్తులు పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న కొండలరావు

టెక్కలి: టెక్కలి పట్టణానికి చెందిన ఎరువుల వ్యాపారి దోని కొండలరావు తనవంతు సాయంతో కబడ్డీ క్రీడాకారులకు క్రీడా దుస్తులను ఆదివారం పంపిణీ చేశారు. స్థానికంగా కబడ్డీలో శిక్షణ పొందుతున్న యువకులను ప్రోత్సహించేందుకు 15 మంది క్రీడాకారులకు దుస్తులు, పౌష్టికాహారాన్ని అందజేశారు. కబడ్డీ కోచ్ నీలయ్య, పీఈటీలు కొండలరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సామాజిక ఆస్పత్రికి సీబీసీ మెషీన్ మంజూరు



ఆస్పత్రికి చేరిన సీబీసీ మెషీన్

కోటబొమ్మాళి: స్థానిక సామాజిక ఆస్పత్రికి సీబీసీ (కంప్యూటర్ బ్లెడ్ కౌంటింగ్) మెషీన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. దీని ద్వారా రోగి శరీరంలో రక్తంలోని పర్సెంటేజీని (తెలుపు, ఎరుపు రక్తకణాలు) తెలుసుకోవడం, డెంగీతోపాటు పలు వ్యాధులను ఈజీగా గుర్తించి వైద్యాన్ని అందజేయవచ్చునని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పొన్నాడ గణేష్ తెలిపారు.

సొసైటీ భూమిని 22-ఏలో ఉంచాలి

టెక్కలి: జగద్ధాత్రి డిస్‌ప్లేస్డ్ గోల్డ్ స్మిత్ ఆర్‌సీసీ స్పన్ పైప్స్ సొసైటీ భూమిని 22-ఏ లో ఉంచాలని పలువురు స్వర్ణకారులు కోరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణిని ఆదివారం కలిసి విన్నవించారు. సర్వే నంబర్ 520-1, 3లోని భూమిని యథావిధిగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు.

24వ వార్డులో 'ఇంటింటికీ పలకరింపు'



పురుషోత్తపురంలో పర్యటిస్తున్న చైర్మన్ గిరిబాబు తదితరులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 24వవార్డు పురుషోత్తపురం గ్రామంలో 'ఇంటింటికీ పలకరింపు' కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు ఆదివారం చేపట్టారు. మంత్రి సీదిరి అప్పలరాజు ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా..లేదా అని అడిగితెలుసుకున్నారు. పథకాలు అందనివారు అర్హత పత్రాలు సమర్పిస్తే పరిశీలించి కొద్ది రోజుల్లోనే వర్తించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బళ్ల ఉషారాణి, ఒకటోవార్డు నాయకుడు దున్న సత్యం, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

గ్లోబల్ వార్మింగ్‌కు మొక్కలే విరుగుడు



మొక్కలు నాటుతున్న గ్రీన్ ఆర్మీ సభ్యులు

మందస: గ్లోబల్ వార్మింగ్ నుంచి రక్షణ పొందాలంటే మొక్కలే శరణ్యమని గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, సొండిపూడి సర్పంచ్ చిచ్చుల నళిని అన్నారు. సొండిపూడి, బాలాజీపురం, గోవిందపురం ప్రాంతాల్లో ఆదివారం మొక్కలను నాటారు. అనంతరం స్థానికులనుద్దేశించి వారు మాట్లాడుతూ.. మొక్కలు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. ప్రతిఒక్కరూ చైతన్యవంతులై మొక్కలు నాటి, వాటిని పెంచి పెద్ద చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిచ్చుల శ్రీనివాసరావు, నగిరి విజయ్‌బాబు, గ్రీన్ ఆర్మీ సభ్యులు నగిరి కరుణాకర్, దాసరి శ్రీనివాసరావు, పంచాయతీ పెద్దలు ఇప్పిలి చంద్రశేఖర్, బడియా వల్లభరావు, కొత్తపల్లి ప్రేమ్‌చంద్, మిస్క గణపతి పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ సభ్యుల ఆర్థిక సాయం



సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

సోంపేట: మామిడిపల్లి గ్రామానికి చెందిన దున్న తులసమ్మ ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌జీఎఫ్ సభ్యులు రూ. తొమ్మిది వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని తులసమ్మ కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు.

అమరవీరుల స్మరణలో..

స్వాతంత్య్రం కోసం ప్రాణార్పణ చేసిన వారిని స్మరించుకోవడం అందరి బాధ్యతని వక్తలు అన్నారు. టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం మండలాల్లోని పలు గ్రామాల్లో నాభూమి–నాదేశం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమర వీరుల జ్ఞాపకంగా నిర్మాణం చేసిన స్థూపాలను ఆవిష్కరించారు. మట్టిని పట్టుకుని ప్రతిజ్ఞ చేశారు. మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, మాజీ సైనిక ఉద్యోగులను సత్కరించి గౌరవించారు.



టెక్కలి: బొప్పాయిపురంలో దేశ నాయకులకు నివాళులర్పిస్తున్న నాయకులు



టెక్కలి: తలగాంలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడులో సమరయోధులకు వందనం చేస్తున్న ఎంపీపీ బోర పుష్ప



ఇచ్ఛాపురం రూరల్: మశాఖపురంలో దివంగత మాజీ సైనికుడు ఆశి తుంబయ్య కోడలు పద్మను సత్కరిస్తున్న దృశ్యం



కవిటి: కుసుంపురంలో శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు



బిగొనపపుట్టుగలో వీరులకు వందనంలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగుల్ని సత్కరిస్తున్న సర్పంచ్ ప్రకాష్



సోంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ నగిరి ప్రభావతి, ఏపీవో ప్రమీల



వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపల్లిలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, సర్పంచ్ డి.పద్మావతి



సోంపేట: కర్తలిపాలేంలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ పాందూరు గున్నయ్య, గ్రామస్తులు



వజ్రపుకొత్తూరు: అనంతగిరిలో నివాళులర్పిస్తున్న సర్పంచ్ కె.మల్లేశ్వరరావు తదితరులు

భూముల రీసర్వే చారిత్రక నిర్ణయం

నందిగాం: రాష్ట్రంలో భూములు రీసర్వే ద్వారా లబ్ధిదారులకు శాశ్వత హక్కు పత్రాలు పంపిణీ చేయాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం దేశంలోనే చారిత్రక ఘట్టమని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. బోరుభద్ర పంచాయతీ కంచూరులో జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా లబ్ధిదారులకు గ్రామకంఠంలో నిర్మించిన గృహాలకు సంబంధించి హక్కు కార్డులను స్థానిక సర్పంచ్ కవిటి ఎర్రన్న ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 70 ఏళ్ల కిందట భూముల సర్వే జరిగిందని..ఆ తరువాత ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం భూముల రీసర్వే కోసం ఆలోచనే చేయలేదన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత రీసర్వేకు నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. ఈ నిర్ణయంతో దేశంలో ఎక్కడా లేని విధంగా సర్వే చేస్తూ లబ్ధిదారులకు హక్కు పత్రాలు అందజేస్తున్నారన్నారు. గ్రామకంఠంలో ఉన్న ఇళ్లకు కూడా హక్కు పత్రాలు అందజేసి ఆ ఇళ్లపై వారికి సంపూర్ణ హక్కులు కల్పించారన్నారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి మాట్లాడుతూ.. రీసర్వేతో రెవెన్యూ రికార్డుల్లో తప్పులు దొర్లకుండా రైతులకు భూహక్కు పత్రాలు ఇవ్వడం శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రికి జగన్‌కు రైతులంతా అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ఐవీ రమణమూర్తి, ఈఓపీఆర్‌డీ రాజారావు, నాయకులు యర్ర చక్రవర్తి, చిన్ని జోగారావు, సర్వే డీటీ శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శి రమణబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న తిలక్

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి

మందస: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. అంబుగాం పంచాయతీ చిన్నలింబుగాంలో ఆదివారం వైఎస్సార్ సున్నావడ్డీ కార్యక్రమంలో జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. డ్వాక్రా మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో మేలు చేశారన్నారు. 1880 మహిళా సంఘాల్లోని 22,180 మంది సభ్యులకు రూ.2.27 కోట్లు సున్నావడ్డీ నిధులు జమ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంబుగాం సర్పంచ్ తిరునగిరి వెంకాయమ్మ, సవరయ్య, సచివాలయం కన్వీనర్ సాలీన లక్ష్మీనారాయణ, వైస్ సర్పంచ్ మాధవరావు, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు సప్ప పొట్టయ్య, గృహసారథులు సింహాచలం, లోకేష్, కొల్లి గున్నయ్య, బతకల తివ్వయ్య, వీఓఏ చంద్రావతి పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

రక్తదానంతో నిలిచిన ప్రాణం

కాశీబుగ్గ: రక్తదానంతో ఓ వృద్ధురాలి ప్రాణం నిలిచింది. తురకలకోటకు చెందిన వృద్ధురాలు అడివమ్మ (70)కు తీవ్ర అనారోగ్యం చేసింది. దీంతో వైద్యం కోసం కుటుంబీకులు కాశీబుగ్గ కృష్ణ ఆస్పత్రికి ఆదివారం తీసుకొచ్చారు. అయితే ఆమె కాలుకు శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. ఆపరేషన్ చేసేముందు రక్తం అత్యవసరమైంది. విషయం తాళ్లబద్ర బ్లడ్‌గ్రూప్ సభ్యుల దృష్టికి వచ్చింది. మామిడి రవితేజ ఆధ్వర్యంలో నడుపుతున్న బ్లడ్‌గ్రూపు సభ్యుడు రమేష్ ఆస్పత్రి వచ్చి రక్తాన్ని దానం చేసి ఆదర్శంగా నిలిచాడు.



రక్తదానం చేస్తున్న రమేష్

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

కంచిలి: నువాగడ గిరిజన పంచాయతీ పరిధి దొలాయిసాయి గిరిజన గ్రామంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన మూడు కుటుంబాలకు ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అండగా నిలిచారు. ఒక్కో బాధిత కుటుంబానికి 40 కిలోల బియ్యం, దుప్పట్లు, వస్త్రాలు, వేయి రూపాయలను ఆదివారం అందజేశారు. ప్రభుత్వం తరపున సాయం అందేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గుమ్మిడి రాందాసు, వ్యవసాయ సలహామండలి చైర్మన్ లడ్డు కేశవ్‌పాత్రో, జేసీఎస్ కన్వీనర్ కొనపల సురేష్, రమేష్ గౌడో, డొక్కరి ఈశ్వరరావు, నెమలిపురి ఈశ్వరరావు, బతకల చిరంజీవి పాల్గొన్నారు.



బాధితులకు సాయాన్ని అందజేస్తున్న దేవదాస్‌రెడ్డి తదితరులు

60 యూనిట్ల రక్తం సేకరణ

టెక్కలి రూరల్: పట్టణానికి చెందిన అభయం యువజన సేవాసంఘం వార్షికోత్సవం, స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని మూడు మండలాల నుంచి యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. సుమారు 60 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు యువజన సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ సీపాన శ్రీనుబాబు, డాక్టర్ అన్నెపు వినోద్, లాడి కామేశ్వరరావు, బెలుసొంటి మధు, సంఘం సభ్యులు శ్రీనివాస్ బెహర, సింహాచలం, వశంత్, రాజేష్, జగదీష్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో వైద్యులు

కంకర తరలింపునకు అనుమతి అవసరం

కోటబొమ్మాళి: కంకర తరలింపునకు మైన్స్, రెవెన్యూ శాఖాధికారుల అనుమతి తీసుకోవాలని..లేదంటే కేసులు నమోదు చేస్తామని కోటబొమ్మాళి ఎస్సై మహమ్మద్ అలి హెచ్చరించారు. స్థానిక పెద్దకొండ సర్వేనంబర్ 280లో అనుమతి లేకుండా కంకర తరలిస్తున్న మంచాలపేట గ్రామానికి చెందిన నాలుగు ట్రాక్టర్లను స్థానిక పోలీసులు ఆదివారం అడ్డుకుని వివరాలు సేకరించారు. స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో మైదానం పూడ్చేందుకు కంకర తరలిస్తున్నట్లు ట్రాక్టర్ల సిబ్బంది చెప్పారు. దీంతో ఇకపై కంకర తరలిస్తే మైన్స్, రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు. తనిఖీల్లో ఏఎస్సై మన్మథరావు, కానిస్టేబుల్ దుర్గారావు ఉన్నారు.

పోస్టల్ కార్యాలయంలో జెండాలు విక్రయం



జనజాగృతి సాహితీ సంస్థ సభ్యులకు జెండా అందజేస్తున్న పోస్టుమాస్టర్ గురునాథ్

కాశీబుగ్గ: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాలను 25 రూపాయల చొప్పున విక్రయిస్తున్నామని పలాస తపాలా కార్యాలయం పోస్టు మాస్టర్ సానా గురునాథ్ తెలిపారు. జెండాల విక్రయాలను ఆదివారం చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సోమవారం కూడా జెండాలను విక్రయిస్తామన్నారు. జనజాగృతి సాహితీసంస్థ సభ్యులను తొలుత జెండాలను కొనుగోలు చేశారు.

పారిశుద్ధ్యం క్షీణించకుండా చర్యలు



కేటీరోడ్డులో చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం క్షీణించకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్ చెప్పారు. దీని కోసం పారిశుద్ధ్య కార్మికులను కేటాయిస్తున్నామన్నారు. కేటీరోడ్డు మొదలుకుని సబ్ రోడ్లలో ప్రతి పాయింట్ వద్ద చెత్త ఉండకుండా చర్యలు తీసుకున్నామన్నారు. చెత్త ఉంటే వెంటనే తమకు తెలియజేయాలన్నారు.

ఫ్యాక్టరీపై నుంచి పడి కార్మికుడు దుర్మరణం



దుదిస్తీ (ఫైల్)

మేదరమెట్ల: ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి కార్మికుడు మృతి చెందాడు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల తమ్మవరం రోడ్డులో గల సింథైట్ కారం ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కొత్తపల్లి దుదిస్తీ (30) ఆదివారం ఫ్యాక్టరీ పైనుంచి పడి దుర్మరణం పాలయ్యాడు. అందిన సమచారం మేరకు.. శ్రీకాకుళం జిల్లా మందస మండలం హరిపురానికి చెందిన కొత్తపల్లి దుదిస్తి గత కొంతకాలంగా మేదరమెట్లలోని సింథైట్ కారం ఫ్యాక్టరీలో కూలీగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే ఫ్యాక్టరీకి వెళ్లిన దూదిస్తే యాజమాన్యం ఫ్యాక్టరీ లోపల పైకప్పు వద్ద పక్షి గూళ్లు ఉన్నాయని వాటిని తొలగించాలని చెప్పడంతో పైకి ఎక్కాడు. కాలిజారి కిందపడటంతో తీవ్ర గాయాలైన కార్మికుడిని ఒంగోలు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కార్మికుడు మృతి చెందాడు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమం చేరువ



సంక్షేమాన్ని వివరిస్తున్న సమన్వయకర్తదువ్వాడ వాణి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి

టెక్కలి:

ఎటువంటి రాజకీయ ప్రమేయం లేకుండా, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి నేరుగా వారి ఇంటికే సంక్షేమ పథకాలు అందేవిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థను రూపకల్పన చేశారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. టెక్కలి గ్రామ సచివాలయం-1 పరిధిలోని ఎన్‌టీఆర్ కాలనీలో పలు వీధుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి గడచిన నాలుగున్నరేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించారు. రేషన్ కార్డు వారీగా బ్రోచర్లను అందజేశారు. సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి పరిష్కారం చూపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ సత్తారు సత్యం, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఎస్.మోహన్, సర్పంచ్‌లు జి.మోహన్‌రెడ్డి, ఎం.శంకర్, ఆర్.జయమోహన్, నాయకులు జి.అప్పలరెడ్డి, వై.అనంతయ్య, డి.శ్రీను, డి.పోలయ్య, వి.శ్రీధర్‌రెడ్డి, ఎ.రాహుల్‌కుమార్, బాలకృష్ణ, ఎం.శివరావు, ఎన్.సోమేష్, టి.లోకేశ్వరరావు, జె.చంద్రరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



దువ్వాడ వాణికి హారతిస్తున్న లాల్‌పండా వెంకట్రావు కుటుంబ సభ్యులు

బాబుకు పునర్జన్మ

మా కుమారుడు వైద్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదు లక్షల రూపాయలను సాయం చేశారు. ఆ డబ్బుతో ప్రస్తుతం వైద్యం చేస్తున్నాం. ముఖ్యమంత్రి చేసిన సాయంతో మా బాబుకు పునర్జన్మ వచ్చింది. ఇటువంటి సాయం చేసిన సీఎంకు జన్మాంత రుణపడి ఉంటామని టెక్కలి ఎన్‌టీఆర్ కాలనీ 17వ లైన్‌కు చెందిన లాల్‌పండా వెంకట్రావు, శాంతి దంపతులు.. సమన్వయకర్త దువ్వాడ వాణి దృష్టికి చెప్పుకొని ఉద్వేగానికి గురయ్యారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా కుటుంబం దువ్వాడ వాణికి ఎంతో అభిమానంతో స్వాగతం పలికారు. ఇంటి లోపలకు తీసుకువెళ్లి మంగళ హారతులు పట్టారు.

'చంద్రబాబు చేసింది శూన్యం'

సోంపేట: చంద్రబాబు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జింకిభద్ర, బెంకిలి పంచాయతీల అభివృద్ధికి ఏం చేశారని సోంపేట ఎంపీపీ నిమ్మన దాస్ ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఇప్పుడు భవిష్యత్‌కు గ్యారంటీ పేరుతో ర్యాలీలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. స్థానికంగా ఉన్న ఎంపీపీ కార్యాలయంలో జింకిభద్ర, బెంకిలి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విలేకరులతో ఆదివారం మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. సంక్షేమ పథకాల అమలులో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలుగుదేశం పార్టీపై ప్రజలకు ఏనాడో నమ్మకం పోయిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు ఈ నియోజకవర్గాన్ని, జిల్లాను ఏమి అభివృద్ధి చేశారన్నారు. బెంకిలి, జింకిభద్ర పంచాయతీలు గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ప్రస్తుత సీఎం జగన్ పాలనలో ఎనలేని అభివృద్ధి సాధించాయన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సాహుకారి జానీ, అనంత్ పెద్దకోట, తట్ట షణ్ముఖరావు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మన దాస్

జీడి మద్దతు ధర కోసం సంతకాల సేకరణ

పలాస:

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో జీడి పిక్కల మద్దతు ధర కావాలని డిమాండు చేస్తూ జీడి రైతాంగ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణకు రైతులు శ్రీకారం చుట్టారు. రైతాంగ కమిటీలు ప్రతి గ్రామంలోను ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పలాస మండలం మాకన్నపల్లి గ్రామంలో ఆదివారం జీఎస్టీ అడిషనల్ కమిషనర్ (వి.ఆర్.ఎస్) మాకన్నపల్లిలో తొలిసంతకం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీడి రైతాంగానికి ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీడి రైతాంగ కమిటీ జిల్లా కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్, కుత్తుం వినోద్, బత్తిన వీరాస్వామి, కుత్తుం ధర్మారావు, తెప్పల రాజు, జుత్తు సంతోష్, దాసరి దానేసు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సాలిన కూర్మారావు పాల్గొన్నారు.



తొలి సంతకం చేస్తున్న తాతారావు